

జహీరాబాద్‌లో గెలవాలి

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ గెలుపుకోసం కార్యకర్తలు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸



ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెయూ సౌత్ క్యాంపస్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నమ్మెకు దిగారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.7 /18.4

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తగ్గుతుంది.

అత్యవసరం పేరిట దందా!

వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం కొనసాగుతోంది. అక్రమ డిప్యుటేషన్లను ప్రభుత్వం రద్దు చేసినా.. రెండు రోజుల ముచ్చటే అయ్యింది. చాలామంది తమకు నచ్చిన స్థానాలకు తిరిగి డిప్యుటేషన్లు వేయించుకున్నారు. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. – కామారెడ్డి టౌన్



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

- వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం
- అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేసిన సర్కారు
- సొంత స్థానాలకు వెళ్లిన 99 మంది ఉద్యోగులు..
- రెండు రోజుల్లోనే మళ్లీ 50 మందికి డిప్యుటేషన్లు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అవినీతి, అక్రమాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. తాజాగా చేపట్టిన ఉద్యోగుల డిప్యుటేషన్‌ల విషయం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. మారుమూల గ్రామాలు, మండల కేంద్రాల్లోని వైద్యులు, ఉద్యోగులు అక్రమ డిప్యుటేషన్‌లతో పట్టణాల్లో ఉంటున్నారని భావించిన ప్రభుత్వం.. వాటిని రద్దు చేస్తూ గతనెల 8వ తేదీన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖలో డిప్యుటేషన్‌లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోనూ డిప్యుటేషన్లు రద్దయ్యాయి. ఒక్కరోజులో పూర్వ స్థానాలకు వెళ్లాలని వైద్యారోగ్య శాఖ అధికారులు ఆర్డర్లు జారీ చేశారు. దీంతో డిప్యుటేషన్‌లపై ఉన్న 99 మంది ఉద్యోగులు, ఇతర సిబ్బంది హుడావుడిగా సొంత పోస్టింగ్ స్థానాలకు వెళ్లి రిపోర్టు చేసి విధుల్లో చేరారు.

రెండు రోజుల ముచ్చటే..

అక్రమ డిప్యుటేషన్ల రద్దు వ్యవహారం రెండు రోజుల ముచ్చటగా మారింది. సర్కారు ఆదేశాలతో 99 మంది సొంత స్థానాలకు వెళ్లి విధుల్లో చేరారు. అత్యవసరం పేరిట మళ్లీ అక్రమ తంతుకు తెరలేపారు. డిప్యుటేషన్‌లపై పనిచేస్తున్నవారంతా సొంత స్థానాలకు వెళ్లడంతో వైద్య సేవలు, కార్యకలాపాలకు అంతరాయం కలుగుతుందని సాకుగా చూపుతూ అత్యవసరం ఉన్న చోట డిప్యుటేషన్‌లు ఇవ్వవచ్చని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సొంత స్థానాలకు వెళ్లినవారిలో చాలామంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. అత్యవసరం పేరిట 50 మందికి డిప్యుటేషన్ ఇచ్చారు. అత్యవసరం పేరిట కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని అవసరం లేని చోట కూడా పలువురికి డిప్యుటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మారుమూల గ్రామాలతోపాటు జుక్కల్, డోంగ్లీ, నాగిరెడ్డిపేట లాంటి ప్రాంతాల నుంచి ఉద్యోగులు, సిబ్బంది డిప్యుటేషన్‌పై పట్టణాలకు వచ్చారు. అధికారులు భారీగా డబ్బులు తీసుకుని వారు కోరుకున్న చోటుకు పంపించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

డిప్యుటేషన్లు ఇలా..

ప్రస్తుతం కంటి వెలుగు ప్రోగ్రాం లేకపోయినా మాచారెడ్డి నుంచి ఒకరిని జిల్లా కార్యాలయానికి పంపించడం గమనార్హం. జుక్కల్ పీహెచ్‌సీనుంచి ఒకరిని, ఎర్రాపహాడ్ పీహెచ్‌సీ నుంచి మరొకరిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు. డోంగ్లీ పీహెచ్‌సీ నుంచి మలేరియా విభాగంలోకి ఒకరిని, డీఎంఈ పరిధిలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో మార్పు హెల్ప్ డెస్క్‌కు ముగ్గురిని, బాన్సువాడ ఎంసీహెచ్‌కు ముగ్గురు స్టాఫ్ నర్సులను డిప్యుటేషన్‌పై పంపించారు. ఎల్లారెడ్డి నుంచి ఒక సీహెచ్‌వోను, జుక్కల్, భిక్కనూరు పీహెచ్‌సీలనుంచి ఆర్‌బీఎస్‌కే ఏఎన్‌ఎంలు ఇద్దరిని, బీబీపేట్ నుంచి ఎంపీహెచ్‌ఈవోను, గాంధారి నుంచి ఆపరేటర్‌ను, నాగిరెడ్డిపేట్ పీహెచ్‌సీ నుంచి ఔట్‌సోర్సింగ్ సెకండ్ ఏఎన్‌ఎంను, మత్తమాల నుంచి ఓ ఫార్మసిస్టును, పిట్లం సీహెచ్‌సీ నుంచి ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్టును.. ఇలా చాలామందిని వారికి అనుకూలమైన చోటుకు అక్రమంగా పంపించారు. అక్రమ డిప్యుటేషన్ల కోసం ఒక్కొక్కరి వద్దనుంచి రూ. 30వేలకుపైగా తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వారం రోజుల్లో మరికొందరిని డిప్యుటేషన్‌పై పంపించనున్నట్లు తెలిసింది. డిప్యుటేషన్‌లతో వైద్య ఆరోగ్యశాఖలో ఓ అధికారికి, పైరవీలు సాగిస్తున్న ఇద్దరు ఉద్యోగులకు కాసుల పంట పండినట్లు తెలుస్తోంది.

అవసరం ఉన్న చోటే..

ఖాళీలు ఉన్నచోట వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూసేందుకు కొందరిని డిప్యుటేషన్‌పై పంపించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు కొందరిని డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి తీసుకున్నాం. ఇంకొందరిని పీహెచ్‌సీలకు డిప్యుటేషన్ వేశాం. – లక్ష్మణ్ సింగ్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి



కలెక్టరేట్ ఆవరణలో ఇష్టారీతిన నిలిపిన వాహనాలు

కలెక్టరేట్‌లో పార్కింగ్ అస్తవ్యస్తం

- షెడ్‌ల నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ఎండలోనే వాహనాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ ఎండలోనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. ఎండకు వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డిలో సుమారు రూ. 70 కోట్లతో నూతన కలెక్టరేట్ భవన సముదాయం నిర్మించారు. అన్ని శాఖల జిల్లా కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత భవన సముదాయం ఉంది. కలెక్టరేట్ వెనక భాగంలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు సంబంధించిన క్యాంప్ కార్యాలయాలున్నాయి. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న స్థలంలో ఆహ్లాదం కోసం గార్డెనింగ్ చేపట్టారు. పక్కనే విశాలమైన ఖాళీ స్థలం ఉంది. కలెక్టరేట్ వెనక కొంత భాగాన్ని, పక్కనున్న ఖాళీ స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. అధికారులు ఎక్కువగా తమ వాహనాలను కార్యాలయం వెనక భాగంలోని పార్కింగ్ స్థలంలో పెట్టుకుంటారు. బయట వారి వాహనాలు కార్యాలయం పక్కనున్న స్థలంలో ఉంచుతారు. ఈ స్థలాన్ని కనీసం చదును కూడా చేయించలేదు. వెనక భాగంలో గానీ, కార్యాలయం పక్కన ఉన్న స్థలంలో గానీ ఎలాంటి షెడ్‌లు లేవు. వందల సంఖ్యలో కలెక్టరేట్ ఉద్యోగుల వాహనాలు ఉంటాయి. ఇవి కాకుండా ఆయా అవసరాల నిమిత్తం నిత్యం కార్యాలయాలకు వచ్చే జనం వందల సంఖ్యలో ఉంటారు. పార్కింగ్‌కు సరైన స్థలం లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడే వాహనాలను నిలుపుతున్నారు.

నిధులున్నా సాగని పనులు

కలెక్టరేట్ నిర్మాణానికి వెచ్చించగా మిగిలిన నిధుల లోనుంచి రూ. కోటిని పార్కింగ్ షెడ్ కోసం కేటాయించారు. కార్యాలయం వెనక భాగంలో ఉన్న విశాలమైన స్థలంలో భారీ షెడ్డు, దానిపై సోలార్ విద్యుత్ ప్యానెల్‌ల ఏర్పాటు చేపట్టేలా ప్రతిపాదించారు. పార్కింగ్ కోసం షెడ్‌లతో పాటు అన్ని కార్యాలయాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం లభిస్తుందని భావించారు. రెడ్‌కో కంపెనీకి పనులు అప్పగిస్తూ అసెంబ్లీ ఎన్నికలకు ముందే శంకుస్థాపన చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఇదే తరహాలో పనులు చేపట్టారు. వాస్తవానికి ఖమ్మం కంటే ముందుగానే కామారెడ్డిలో షెడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. కానీ ఇక్కడ మాత్రం పనులు ముందుకు సాగడం లేదు.

వసతులు కల్పించాలి

కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి అధికారుల వద్ద సుమారు 50 వరకు హైర్ (అద్దె) వెహికల్స్ ఉన్నాయి. స్థలం దొరికితే చెట్ల కింద, లేదంటే ఎండలోనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. మధ్యాహ్నం భోజనం చేయడానికి కనీసం ఓ గది కూడా కేటాయించలేదని అద్దె వాహనాల డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటి వసతి కూడా లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని పేర్కొంటున్నారు. షెడ్‌ల నిర్మాణం చేపట్టి నీడ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

షెడ్లు నిర్మించాలి..



ఎండలోనే వాహనాలు పెట్టుకుంటున్నాం. తీవ్రమైన ఎండలో ఉంచితే వాహనాలు చెడిపోయే అవకాశాలుంటాయి. షెడ్‌లు నిర్మిస్తే బాగుంటుంది. అలాగే డ్రైవర్లు భోజనం చేయడానికి, విశ్రాంతికోసం గదులు కేటాయించాలి. – రాజాగౌడ్, హైర్ వెహికల్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రం తనిఖీ



భిక్కనూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సందర్శించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవం

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ బావయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మహిళలూ.. పెట్టుబడి పురోగతిని వేగవంతం చేయండి' అనే నినాదంతో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

'వన్యప్రాణులను వేటాడితే చర్యలు'




రామారెడ్డి: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో గోపాలరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన అన్నారంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల గ్రామంలోని ఓ ఇంట్లో పేలుడు పదార్థాలు పేలిన ఘటనపై విచారణ జరిపామన్నారు. వాటిని అటవీ జంతువులను హతమార్చడానికే దాచారన్న నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాలలో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. వన్యప్రాణుల వేటకు సంబంధించిన ఏ వస్తువు దొరికినా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వన్యప్రాణులను వేటాడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించి కేసుల నమోదు చేస్తున్నామని, రాష్ట్రంలో కామారెడ్డి జిల్లాలోనే అత్యధిక కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి దివ్య, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటు హక్కుపై అవగాహన కల్పించండి'



కామారెడ్డి రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేసేందుకు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం అడ్లూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'తెలంగాణ ఓటరు – తల్లిదండ్రుల సంకల్ప పత్రం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 60 వేల మంది విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు సంకల్ప పత్రాలు అందజేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా కులం, మతం, ప్రాంతం, భాష ఇతర ప్రలోభాలకు లొంగకుండా తప్పకుండా ఓటు వేస్తామని తల్లిదండ్రుల నుంచి సంకల్ప పత్రాలను స్వీకరిస్తామన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఈ వినూత్న ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ శ్రీపతి, ఎంఈవో ఎల్లయ్య, పాఠశాల హెచ్‌ఎం సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతిలేని షెడ్‌ల సీజ్



కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్‌లపై మున్సిపల్ అధికారులు మంగళవారం కొరడా ఝుళిపించారు. మున్సిపల్ రెవెన్యూ ఆర్‌ఐ జానయ్య ఆధ్వర్యంలో అశోక్‌నగర్ కాలనీ, నిజాంసాగర్‌రోడ్, హౌసింగ్‌బోర్డు, కొత్తబస్టాండ్ తదితర ప్రధాన రోడ్లలో అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్‌లను సీజ్ చేసి యజమానులకు నోటీసులు ఇచ్చారు. తక్షణమే స్థలం డాక్యుమెంట్లు సమర్పించి బల్దియా నుంచి ఇంటి నంబర్ తీసుకుని ఆస్తి పన్ను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా బల్దియా బడ్జెట్ సమావేశం

- రూ.7.84 కోట్లతో బాన్సువాడ బడ్జెట్
- ఆమోదం తెలిపిన కౌన్సిలర్లు



అధికారులను నిలదీస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీలో మంగళవారం జరిగిన బల్దియా బడ్జెట్ సమావేశం వాడివేడిగా కొనసాగింది. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశంలో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7.84 కోట్ల అంచనా బడ్జెట్‌కు సంబంధించిన వివరాలను కమిషనర్ అలీం సభ్యులకు చదివి వినిపించారు. కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం లేకుండా ఇళ్ల అనుమతులు ఇస్తున్నారని, తప్పనిసరిగా సంబంధిత కౌన్సిలర్‌కు సమాచారం అందించాకే ఇళ్ల అనుమతులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అధికారులను కోరారు. వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటి అవసరాల కోసం నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు కాసుల బాల్‌రాజ్, నందకిషోర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ మాట్లాడుతూ రూ.7.84 కోట్ల బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారన్నారు. సభ్యులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేసవి కాలంలో పట్టణ వాసులకు ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కమిషనర్ అలీం, సిబ్బంది మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

21న అవిశ్వాస పరీక్ష

- డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డిపై..
- నోటీసులు జారీ చేసిన డీసీవో శ్రీనివాస్

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిపై అవిశ్వాస పరీక్షకు తేదీ ఖరారైంది. ఈ నెల 21న డీసీసీబీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌తో పాటుగా డైరెక్టర్లకు జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో) శ్రీనివాస్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. డీసీసీబీ బ్యాంకుకు వెళ్లిన ఆయన రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ల సంతకాలు సరైనవో కాదో సరి చూసుకున్నారు. భాస్కర్ రెడ్డి తమకు చైర్మన్‌గా వద్దని సోమవారం 15 మంది డైరెక్టర్లు డీసీవోకు లేఖను అందజేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సహకార శాఖ నిబంధనల ప్రకారం చైర్మన్‌పై అవిశ్వాస పరీక్షకు డీసీవో కసరత్తు చేపట్టారు. అయితే అవిశ్వాసం పెట్టిన డైరెక్టర్లు ఇంకా క్యాంపులోనే ఉన్నారని తెలుస్తోంది. అవిశ్వాస పరీక్షను నెగ్గి చైర్మన్ పదవిని కాపాడుకోవడానికి భాస్కర్ రెడ్డికి పక్షం రోజుల పాటు సమయం ఉంది. ఈలోపు డీసీసీబీ రాజకీయ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- సమస్యలుంటే ముందుగానే పరిష్కరించండి
- మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల అధికారులతో మాట్లాడారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ట్యాంక్‌ల నుంచి ఇళ్లకు జరిగే నీటి సరఫరాలో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. చిన్నచిన్న సమస్యలుంటే స్థానికంగానే పరిష్కరించాలని, బడ్జెట్ ఎక్కువ అవసరమయ్యే పనులపై ఉన్నతాధికారులతో మాట్లాడి, ముందుకు వెళ్లాలని సూచించారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నట్లయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు గ్రామాల్లో నిత్యం పర్యటించాలన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకున్న సందర్భంలో పూర్తి వివరాలు అందజేయనివారి కోసం మండల పరిషత్‌లు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజాపాలన దరఖాస్తు రసీదుతోపాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ బుక్, గ్యాస్ సిలిండర్ బిల్లులను తీసుకుని అర్హతగలవారికి లబ్ధి చేకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. అర్హత గల వారికి రూ.500 లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతున్నాయన్నారు. డీపీవో శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేష్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై అవగాహన కల్పించండి

కామారెడ్డి క్రైం: మండల పరిషత్, మున్సిపాలిటీలలో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ తెలిపారు. వీటిపై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్యారంటీ పథకాలు అమలు చేసేందుకుగాను ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. ఆయా వివరాలు సరిగా లేనికారణంగా లబ్ధిపొందని వారు ప్రజాపాలన సేవా కేంద్రాలలో సంప్రదించాలని సూచించారు. అలాగే నూతనంగా ప్రజాపాలన దరఖాస్తుల సైతం అందించవచ్చన్నారు. ఒక తెల్ల రేషన్ కార్డుపై ఒక గ్యాస్ కనెక్షన్, ఒక విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు మాత్రమే గ్యారంటీ పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ప్రజా పాలన సేవా కేంద్రాలలో అవసరమైన మేర దరఖాస్తులు అందుబాటులో ఉంచాలన్నారు. గ్యారంటీ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అవసరమైన డాక్యుమెంట్‌లను సేకరించి ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సేవా కేంద్రాలపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని కలెక్టర్‌లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీపీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యతో ఉద్రిక్తత

- భర్త ఇంటిపై మృతురాలి బంధువుల దాడి..
- తలుపులు, ఇంట్లోని వస్తువులు ధ్వంసం
- న్యాయం చేయాలని సాయంత్రం వరకు కొనసాగిన నిరసన
- గ్రామానికి చేరుకున్న ప్రొబెషనరీ ఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు
- పోలీస్ బందోబస్తు మధ్య మృతదేహం తరలింపు



అరుణ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఆమె తరుపు బంధువులు విధ్వంసం సృష్టించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ధర్మారావ్‌పేట్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన నీల అరుణ(21)ను ఏడాది క్రితం ధర్మారావ్‌పేట్ గ్రామానికి చెందిన దొంతర బోయిన అనిల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లయిన నాటి నుంచి అరుణకు అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. ఆమె భర్త ఇటీవల విదేశాల నుంచి వచ్చాడు. మంగళవారం వ్యవసాయ బావి వద్ద భోజనం ఇవ్వడానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అరుణ మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన చుట్టు పక్కల వారు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే అరుణ మృతదేహం ఫ్యాన్‌కు వేళాడు తోంది. వెంటనే పోలీసులకు, మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. ధర్మారావ్‌పేట్‌కు చేరుకున్న మృతురాలి బంధువులు ఇంట్లోని వస్తువులను, తలుపులను ధ్వంసం చేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై రాజు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్పెషల్ ఫోర్సు బలగాలను రప్పించారు. ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడారు. అయితే న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసేది లేదని మృతురాలి బంధువులు స్పష్టం చేశారు. రూ. 60 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పందం చేసుకున్న అనంతరం మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలి తండ్రి నీల స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు విచారణ అధికారి ప్రొబేషనరీ ఎస్పీ కాజల్ పేర్కొన్నారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ





మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, నివాళులర్పిస్తున్న కవిత, సురేందర్

గాంధారి: నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో హత్యకు గురైన గాంధారి మండలం తిప్పారంతండాకు చెందిన డిగ్రీ విద్యార్థి వెంకట్రాం కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. విద్యార్థి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీటీసీ శంకర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ తానాజీరావు తదితరులున్నారు.

క్లుప్తంగా

నేడు వైస్‌ఎంపీపీపై బలపరీక్ష



రామారెడ్డి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రావుపై బుధవారం బలపరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సవిత మంగళవారం పేర్కొన్నారు. మండలం ఏర్పాటు అనంతరం తొలి ఎంపీపీ, వైస్ ఎంపీపీపై ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు గత నెలలో కామారెడ్డి ఆర్డీవోకు అవిశ్వాస తీర్మాన నోటీసులు అందజేయగా ఆర్డీవో బలపరీక్షను ఈ నెల 6న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి అవిశ్వాసంపై హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోగా వైస్ ఎంపీపీ రవీందర్‌రావుపై నేడు బలపరీక్ష జరగనుంది. మండల పరిషత్‌లో 10 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఉదయం 11 గంటలకు వైస్ ఎంపీపీపై బలపరీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



భిక్కనూర్: తెయూ అనుబంధమైన సౌత్ క్యాంపస్, సారంగాపూర్ క్యాంపస్‌లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ అవుట్సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సమ్మె బాట పట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. సౌత్ క్యాంపస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రవి మాట్లాడుతూ.. రూ.20 వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి మరిచారని, అందుకే సమ్మె బాట చేపట్టినట్లు తెలిపారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మద్దతు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శ్రీకాంత్, స్వామి, శ్రీమాన్, రాజు, రాజేశ్వర్, మల్లేశ్, సత్తయ్య, సిద్ధిరాములు, వేణుమాధవ్, హారిక, రజిత తదితరులు పాల్గొన్నారు.

సాహితీ రంగంలో అవకాశం కల్పిస్తాం



దోమకొండ: సాహితీ రంగంలో విద్యార్థిని భవానికి అవకాశం కల్పిస్తామని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అభినందనలో సభలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన విద్యార్థిని భవాని 8 నిమిషాల్లో 100 పద్యాలను అలవోకగా చదవడం ఎంతో గొప్ప విషయమన్నారు. భవానికి రికార్డు సాధన కోసం అవకాశాన్ని కల్పించి, సాహిత్యంలో ప్రత్యేక స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం తెలుగు రచయితలు ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శరత్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయురాలు ఉమాదేవి, తెలంగాణ రచయితల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రాజ్, కాసర్ల రాంచంద్రం, నాగభూషణం, కమలాకాంత్, బాలకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వెంచర్‌కు ప్రభుత్వ వంతెనలు

- రియల్టర్ల కోసం టీయూఎఫ్ఐడీసీ నిధుల మళ్లింపు!
- ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్‌లైన్లు
- ప్రతిఫలంగా అప్పటి ప్రజాప్రతినిధికి రోడ్డు పక్కన 1500 గజాలు గిఫ్ట్



మానిక్‌బండార్ వద్ద వెంచర్ ముఖద్వారం

మాక్లూర్: అక్రమాల్లో ఆరితేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రజాప్రతినిధి అండతో నగరానికి ఆనుకొని భారీ వెంచర్ రూపుదిద్దుకోగా.. ప్రభుత్వ నిధులను అడ్డగోలుగా దానికోసం ఉపయోగించారనే ఆరోపణలున్నాయి. సదరు ప్రజాప్రతినిధికి ఉన్న 'ఆశ'ను క్యాష్ చేసుకోవాలనుకున్న రియల్టర్లు అతగాడికి రోడ్డు పక్కనే 1500 గజాల భూమిని గిఫ్ట్‌గా ఇచ్చినట్లు సమాచారం. 'ఆశ' వెంచర్ నిర్మాణానికి దారిచూపింది. అధికార బలం ఉపయోగించి రైతుల భూముల్లో గద్దల్లా వాలిన రియల్టర్లు భూమి విక్రయించేందుకు నిరాకరించిన రైతులను బెదిరించారు. భారీ వెంచర్ నిజామాబాద్ నగర పరిధిలోని రెండో డివిజన్‌లో ఉన్నప్పటికీ.. రెవెన్యూ శివారుమాత్రం మాక్లూర్ మండలం మానిక్‌బండార్ పరిధిలో ఉంది. వ్యవసాయభూములను ప్లాట్లుగా మార్చేందుకు అవసరమైన మొరం కోసం మాక్లూర్ శివారులోని గుట్టలను తవ్వేశారు. విద్యుత్ అధికారులను బెదిరించి ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్‌లైన్లు వేసినట్లు తెలిసింది.

చెరువుశిఖం, దేవాదాయ భూమి ఖతం

సర్వే నంబర్ 499లోని దేవాదాయ శాఖకు చెందిన 30గుంటల భూమి, 480లో 14 గుంటలు, 477లో 2 ఎకరాల 5 గుంటలు, 503లో 19 గుంటలు, 548 లో 29 గుంటలు మొత్తం 4 ఎకరాల 7 గుంటల భూమితోపాటు సమీపంలోని బచ్చల చెరువు శిఖం 3 నుంచి 4 ఎకరాల వరకు ఉన్న భూమిని వెంచర్‌లో కలిపేసినట్లు ఆరోపణలున్నాయి. ప్రశ్నించిన మానిక్‌బండార్ గ్రామస్తులను బెదిరించి నోళ్లు మూయించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకుడు వెంచర్ యాజమాన్యానికి సహకరించారనే విమర్శలు ఉన్నాయి.

టీయూఎఫ్ఐడీసీ నిధులతో వంతెనలు

పట్టణ ప్రాంతాల్లో కనీస సదుపాయాల కల్పన కోసం వెచ్చించాల్సిన తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులను దారి మళ్లించి భారీ వెంచర్ కోసం వంతెనలు వేశారనే ఆరోపణలున్నాయి. భారీ వెంచర్‌లోకి వెళ్లాలంటే ఆర్టీసీ కాలనీలోని మహాలక్ష్మి కాలనీ వద్ద, గూపన్‌పల్లి గుండువాగు వద్ద రెండు భారీ వంతెనలు నిర్మించాలి. వాగు అవతల వెంచర్లు వేసిన రియల్టర్లు సొంత డబ్బులతో వంతెనలు నిర్మించాలి. కానీ మాజీ ప్రజాప్రతినిధి అండతో 'విలీన గ్రామాల అభివృద్ధి కోసం..' అని టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.10కోట్లు దారి మళ్లించి వంతెనలు నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. భారీ వెంచర్ అక్రమాలపై స్థానిక కార్పొరేటర్ రాయ్ సింగ్ ఇప్పికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

తెయూలో జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రముఖ కవులు

నిజామాబాద్ రూరల్: 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు – సమాలోచన' అనే అంశంపై తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభమైంది. మంగళవారం ప్రారంభమైన సదస్సు రెండురోజులపాటు కొనసాగనుంది. తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ లక్ష్మణచక్రవర్తి ప్రారంభోపన్యాసం చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ.. శాస్త్ర గ్రంథాలను చదివితే మన ప్రాచీనులు మనకందించిన శాస్త్రీయ అంశాలు తెలుస్తాయన్నారు. పావులూరి మల్లన గణితశాస్త్ర సంగ్రహనం, నాడీనిదానం, నేత్ర దర్పణం తదితర గ్రంథాల్లో శాస్త్రీయ అంశాలు దాగున్నాయన్నారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. శస్త్రం, శాస్త్రం, కావ్యం.. ఈ మూడూ కావ్యానికి ఆలంబనాలని పేర్కొన్నారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. సాహి త్యంపై ఇంకా పరిశోధనలు జరగాలని, ఇటువంటి సదస్సులు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఆత్మీయ ప్రొఫెసర్లు పి కనకయ్య, కమలాకరశర్మ, కేఎస్‌వీవీ. సూర్యనారాయణ మూర్తి, డాక్టర్ గోలిపెంచల ప్రసాద్, కోయి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలి

కామారెడ్డి టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మ్యాని ఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమ కోసం ప్రత్యేక చొరవచూపాలని కేంద్రాన్ని కోరారు. పోటీ చేసే రాజకీయ పార్టీలు స్పందించాలన్నారు. నాయకులు నితీశ్‌రెడ్డి, రంగ్యా నాయక్,బంటుస్వామి,రాజు,వెంకట్ పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



ఎల్లారెడ్డిరూరల్: మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదివే 5వ తరగతి విద్యార్థులు స్వయం పాలన దినోత్సవంలో భాగంగా ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో రాంచరణ్, ప్రజయ్‌కుమార్, హరిచరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలి

నాగిరెడ్డిపేట: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ఈ నెల 7 నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు వృథాకాకుండా చూడాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

'జహీరాబాద్'ను కైవసం చేసుకోవాలి

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



పార్టీలో చేరిన నాయకులతో సుదర్శన్‌రెడ్డి

బాన్సువాడ: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కై వసం చేసుకొని కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండలానికి చెందిన సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంటీసీలు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. కొయ్యగుట్ట పీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఘర్‌వాపసీ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో అక్రమా లు చేశారని, ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధరణి సమస్యలను పరిష్కరించేందుకు తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గడుగు గంగాధర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేశ్‌రెడ్డి, వ్యాపారవేత్త శ్రీనివాస్ రావు, నాయకులు నందురెడ్డి, ప్రతాప్‌సింగ్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, నార్ల రత్నకుమార్, యలమంచిలి శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, పాత బాలకృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, కిశోర్‌యాదవ్, నారాగౌడ్, రమేశ్, లాయక్, అక్బర్, నరేశ్‌రాథోడ్, నార్ల సురేశ్, నార్ల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

నస్రుల్లాబాద్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దుర్కి సహకార సంఘం అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయల సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ కిశోర్‌యాదవ్, మాజీ సర్పంచులు నారాగౌడ్, బద్యానాయక్, అంబయ్య, అంగోత్ మంజుల, వాజీద్, కుమ్మరి నారాయణ, బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్, బైరాపూర్, మల్లాపూర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

హ్యాట్సాఫ్ ప్రణీత..

- ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



నియామకపత్రం అందుకుంటున్న ప్రణీత

బాన్సువాడ రూరల్: మగవారి కంటే ఆడవారు ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారు మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి చెందిన యు ప్రణీత. గతేడాది ఆగస్టులో నిర్వహించిన టీజీటీ, పీజీటీ, జూనియర్, డిగ్రీ లెక్చరర్ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి నాలుగు ఉద్యోగాలు సాధించి అందరినీ అబ్బురపర్చింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రణీత డిగ్రీ లెక్చరర్‌గా నియామక పత్రాలు అందుకుంది.

ప్రైమరీ నుంచి క్లాస్ ఫస్ట్

సోమేశ్వర్ గ్రామానికి చెందిన యు ప్రకాశ్, సంధ్యారాణిలకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. మూడవ కుమార్తె అయిన ప్రణీత చిన్నప్పటి నుంచి చదివిన ప్రతి తరగతిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించేది. బాన్సువాడలోని శ్రీసాయి స్కూల్‌లో పదో తరగతి చదివిన ప్రణీత 552మార్కులు సాధించింది. ఇంటర్‌లో 936 మార్కులు, డిగ్రీలో 91శాతం మార్కులతో యూజీసీ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. దానికి గాను రూ.60వేలు రాగా పక్షవాతానికి గురైన తండ్రి ఆస్పత్రి ఖర్చులకు వెచ్చించింది. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి 2017లో ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేసింది. బాన్సువాడలోని ఎస్‌వీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి 2020లో బీఈడీ పూర్తిచేస్తున్న క్రమంలోనే 2019లో టీఎస్ సెట్ ఉత్తీర్ణత సాధించింది.

కుటుంబ బాధ్యత నెరవేరుస్తూ..

చదువులో ఎంతో ముందున్న ప్రణీత, తన కుటుంబ బాధ్యతలను నెరవేర్చి 'బేటీ హోతో ఐసీ' అని అనిపించుకుంది. వారంతపు సంతల్లో రెడిమెడ్ దుస్తుల వ్యాపారం చేసే తండ్రి ప్రకాశ్ అప్పులపాలై 2017లో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అప్పటికే ఇద్దరు అక్కల పెళ్లి జరిగిపోవడం, తమ్ముడు, చెల్లి చదువుకుంటుండంతో కుటుంబ భారాన్ని తన భుజాలపై వేసుకుంది. 2017 నుంచి 2018 వరకు స్థానిక ఎస్ఎస్ఎల్ డిగ్రీకళాశాలలో లెక్చరర్‌గా, 2018 నుంచి 2020 వరకు బాన్సువాడ మండలం బోర్లంలోని సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా, 2020 నుంచి 2023 వరకు తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేసింది. అదే క్రమంలో 2023లో కేజీబీవీలో పీజీసీఆర్‌టీ పరీక్షరాసి చక్కటి ప్రతిభతో ఎల్లారెడ్డిలోని కేజీబీవీలో ఆగస్టు నుంచి లెక్చరర్‌గా పనిచేస్తోంది. తల్లిదండ్రులకు వైద్య సేవలు అందిస్తూ ఖాళీ సమయంలో ఇంటివద్ద ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమయ్యేది. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచిన ప్రణీతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



డిగ్రీలెక్చరర్‌గా ఉద్యోగం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ఇది నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా భావిస్తున్నాను. ఉద్యోగం ఎక్కడ కేటాయిస్తే అక్కడ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లి ఉద్యోగం చేస్తాను. సహకారం అందించిన ఉపాధ్యాయులకు, స్నేహితులకు, సహ ఉద్యోగులకు కృతజ్ఞతలు. –ప్రణీత

మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మున్నూరుకాపు నాయకులు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు కె దేవయ్యపటేల్, ఎండీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవిపటేల్, యువత అధ్యక్షుడు సంజయ్‌పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శివపటేల్ మట్లాడుతూ.. గత ప్రభుత్వం మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలేదని కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డి.శ్రీధర్‌బాబుకు విన్నవించగా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రతిజిల్లాకు మున్నూరుకాపు బాలిక, బాలుర గురుకుల వసతి గృహాలు మంజూరు చేయాలని, యువతకు ఉపాధి రుణాలు, కోకాపేట భవనానికి రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, మహిళా అధ్యక్షురాలు బజా లలిత, సమన్వయకర్త నీలం నర్సింలు, రైతు సంఘం అధ్యక్షుడు ఆకుల సిద్ధిరాములు, ప్రతినిధులు ఎస్.రాజలింగం, ఎం.లింగం, అనురాధ, మాలవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అమెరికా నుంచి వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో మంథని యువకుడి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



శ్రావణ్‌గౌడ్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటో ట్రాలీని బైక్ ఢీకొట్టిన ఘటనలో మంథని గ్రామానికి చెందిన యువకుడు వేంపల్లి శ్రావణ్‌గౌడ్(27) మృతి చెందగా, అతడి స్నేహితుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న శ్రావణ్‌గౌడ్ నెల రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తన స్నేహితుడు అన్వేష్‌గౌడ్‌తో కలిసి బైక్‌పై పిప్రిలోని బంధువు ఇంటికి వెళ్లి తిరిగివస్తుండగా ఆర్మూర్ మండలం పిప్రి శివారులో ఆటో ట్రాలీని ఢీకొట్టారు. గాయాలపాలైన యువకులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, శ్రావణ్ అప్పటికే మృతి చెందాడు. అన్వేష్ ఓ ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రావణ్‌గౌడ్ ఈనెల 12వ తేదీన తిరిగి అమెరికా వెళ్లాల్సి ఉండగా ఈ ఘోరం జరిగింది. శ్రావణ్ మృతితో గ్రా మంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

కామారెడ్డి క్రైం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమై రెండు రో జుల తర్వాత చెరువులో శవ మై తేలిన ఘటన కామారెడ్డి లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గాంధారికి చెందిన గుర్రం వెంకటరమణ(27) తన తల్లి, భార్యతో కలిసి దేవునిపల్లిలోని బంధువుల ఇంటికి ఈ నెల 2న వచ్చాడు. మరుసటి రోజు తల్లి, భార్య గాంధారికి వెళ్లగా అతను మాత్రం దేవునిపల్లిలోనే ఉన్నాడు. ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు వెళ్లిన వెంకటరమణ తిరిగి రాలేదు. కామారెడ్డి పెద్ద చెరువు వద్ద బైక్, చెప్పులు కనిపించడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం ఉదయం బయటకు తేలింది. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురయ్య పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దన్నూర్ గ్రామానికి చెందిన సయ్యద్ ఆమేర్ (30) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. క్లీనర్ దీపక్‌తో కలిసి డీసీఎంతో అనంతపురంకు అరటిపండ్ల లోడ్‌తో వెళ్లి తిరిగి వస్తున్నాడు. టేక్రియాల్ వద్దకు రాగానే అదుపు తప్పిన డీసీఎం బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రోడ్డు వెంబడి వేసి ఉన్న మట్టి కుప్పలోకి దూసుకుపోయింది. డ్రైవర్ సయ్యద్ ఆమేర్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమరయ్య తెలిపారు.

మోసానికి గురైన బాలిక ఆత్మహత్య

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరిట మోసానికి గురైన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. బాలిక ఇంటర్మీడియట్ చదువుతుంది. అదే గ్రామానికి చెందిన యువకుడు కొడబోయిన అశోక్ రెండేళ్లుగా బాలికతో ప్రేమ వ్యవహారం నడిపాడు. ఈ క్రమంలో బాలిక గర్భవతి కావడంతో తనను పెళ్లి చేసుకోవాలని యువకుడిని కోరింది. అశోక్ పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలిక మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. నిందితుడు అశోక్‌పై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శాస్త్రినగర్‌లో భూక్యా కమల అనే వృద్ధురాలు మనస్తాపంతో సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శాస్త్రినగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న కమల కూలీ పని చేస్తూ జీవిస్తోంది. ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

కుటుంబ కలహాలతో..

కామారెడ్డి క్రైం: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ గ్రామానికి చెందిన అబ్బుగారి మమత (36)కు ఆమె భర్తతో కొద్దిరోజులుగా చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన మమత మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త రవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలాన్ని రైల్వే ఎస్సై తావూ నాయక్ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎల్లారెడ్డిలో వందశాతం పల్స్ పోలియో



చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శరత్ అన్నారు. మండలంలో ఐదేళ్ల లోపు చిన్నారులు 3241 మంది ఉన్నారని వీరందరికి మంగళవారం నాటికి వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సిబ్బందిని అభినందించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్


'ఏటీఎం' మోసాలకు పాల్పడిన ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పలు ఏటీఎం సెంటర్‌లలో అమాయక ప్రజలను మోసం చేసి, వారి ఏటీఎం నుంచి డబ్బులను దండుకున్న రమేశ్ అలియాస్ బగ్గిలి రాజును అరెస్ట్ చేసినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన రమేశ్ ఇటీవల నగరంలోని ఒకటవ పరిధిలోని మూడు ఏటీఎం సెంటర్‌లలో చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. డబ్బులు డ్రా చేసేందుకు ఏటీఎం సెంటర్‌లకు వచ్చిన అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి, వారి ఏటీఎంలను దొంగిలించి, అకౌంట్‌లో ఉన్న డబ్బులను డ్రా చేసేవాడని చెప్పారు. ఉదయం ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. దీంతో ఏటీఎంలలో చోరీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు చెప్పారు. మూడు కేసుల్లో రూ. 30 వేల నగదు రికవరీ చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఐకేపీ అధికారిపై దాడి.. కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఐకేపీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. మండలంలోని సోమార్‌పేట్‌కు చెందిన పందిటి అనురాధా స్త్రీ నిధి రుణం తీసుకుని తిరిగి చెల్లించక పోవడంతో ఐకేపీ అసిస్టెంట్ మేనేజర్ కొండం శ్రీనివాస్ డబ్బులు చెల్లించాలని కోరాడు. దీంతో అనురాధ భర్త బాలకృష్ణ అసిస్టెంట్ మేనేజర్‌పై దాడి చేశాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోడకు కన్నం వేసి..



ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్ గార్డెన్‌లో మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర మొబైల్ షాప్‌లో సోమవారం రాత్రి షాపు వెనుక భాగంలో గోడకు కన్నం వేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం షాపు తీసేందుకు వెళ్లిన యాజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు మొబైల్ షాప్‌లో ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లను కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో విలువైన సెల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లినట్లు యజమాని తెలిపారు. పోలీసులు, క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి తండా సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. భవానీపేటకు చెందిన బోరంచ సంగప్ప తన భార్య విజయతో కలిసి మెదక్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలుకాగా, వారిని చికిత్స నిమిత్తం 108 అబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని అడివిలింగా గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన ధనావత్ సుమిత్ర(18) గత నెల 29న రాత్రి సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిందన్నారు. బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో తొమ్మిది నెలల జైలు

బాన్సువాడ రూరల్: ద్విచక్ర వాహనం చోరీ కేసులో మండలంలోని దేశాయిపేట్‌కు చెందిన తౌతి విఠల్‌కు న్యాయస్థానం తొమ్మిది నెలల జైలుశిక్షతోపా టు జరిమానా విధించింది. బాన్సువాడ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భార్గవి మంగళవారం తీర్పు వెలువరించారు. సరైన సాక్ష్యాలు, ఆధారాలతో దోషికి శిక్ష పడేలా వ్యవహరించిన పోలీసులను అభినందించారు.